# సింగిల్ పేజీ కథలు

## నేటి తల్లిదండ్రులు

''మమ్మీ!''

వంట పనిలో నిమగ్నమై ఉన్న రాజేశ్వరి కూతురు స్వప్న పిలుపుకి వెనుదిరిగి చూసింది.

''ఏమిటి స్వప్నా'' అంది కూతురి వైపు చూస్తూ.

''మమ్మీ నీకో విషయం చెప్పాలి'' అంది ఏదో సందిగ్ధంగా.

''చెప్పమ్మా! ఏమిటి సంగతి?'' అంది రాజేశ్వరి.

''ఆ విషయం నీకు చెప్పాలంటే నాకు భయంగా ఉంది'' అంది స్వప్న తలవంచుకొని.

''అంటే చెప్పడానికే భయపడే పని నువ్వేం చేసావ్?'' అంది రాజేశ్వరి స్వప్నకు దగ్గరగా వస్తూ.

''మమ్మీ నేను ఒక వ్యక్తిని ప్రేమించాను. చాలా రోజులుగా నీతో ఈ విషయం ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను'' అని చెప్పేసింది స్వప్న ధైర్యం చేసి.

స్వప్న మాటలు విన్న రాజేశ్వరి ఎటువంటి ఆందోళనకూ లోను కాలేదు. ఎటువంటి షాక్ తినలేదు. మామూలుగానే ఉంది.

''అతనిలో ఏమి నచ్చి నువ్వు ప్రేమించావు?'' ప్రశ్నించింది రాజేశ్వరి.

''అతను నా మనసుకు నచ్చి, నేను ప్రేమించాను'' అంది స్వప్న ధైర్యంగా.

''అతను నీ మనసుకు నచ్చితే చాలా? ఇక మిగిలిన విషయాలు ఏమీ నచ్చనక్కర లేదా?'' మళ్లీ ప్రశ్నించింది రాజేశ్వరి.

''మిగిలిన విషయాలింకేముంటాయి?'' ఆశ్చర్యంగా అంది స్వప్న.


''మిగిలిన విషయాలంటే అతని గుణగణాలు, కుటుంబ పరిస్థితులు, అతని ప్రవర్తన, అతని ఆలోచనా ధోరణి లాటి విషయాలు'' అంది రాజేశ్వరి.

''అతని గుణగణాలు అతని ప్రవర్తన అంతా మంచిదే. అందుకే అతను నాకు నచ్చాడు'' ధీమాగా అంది స్వప్న.

''చూడు స్వప్నా! నెలరోజులుగా సాయంకాలం ఒక గంటసేపు నువ్వు అతనితో పార్కులో గడుపుతున్నావు. అంతమాత్రం చేత అతనిని ప్రేమించడం, అతనిపై మనసు పారేసుకోవడం, అతను అన్నిరకాలా ఉత్తముడు అనుకోవడం తెలివితక్కువతనం'' అంది రాజేశ్వరి.

రాజేశ్వరి మాటలకు ఒక్కసారిగా షాక్ తిన్నది స్వప్న.

'తను రోజూ పార్కులో కిరణ్‌ను కలుసుకోవడం తన తల్లికెలా తెలిసింది? చాలా ఆశ్చర్యంగా ఉంది' అనుకుంది మనసులో స్వప్న.



''ఈ విషయం నీకెలా తెలుసు మమ్మీ'' ప్రశ్నించింది స్వప్న.

''నిన్ను ఇరవై సంవత్సరాలుగా పెంచుతున్నాను. నీ మాటలకు అర్థాలను, నీ మౌనానికి భావాన్ని, నీ చర్యలకు కారణాలను, నీ ఉత్సాహంలోని ఆంతర్యాన్ని నేను గ్రహించగలను. అదే పద్ధతిలో నువ్వు నెలరోజులుగా కంప్యూటర్ క్లాస్ పేరుతో ఎక్కడికెళుతున్నావో, రోజూ ఆలస్యంగా ఇంటికి ఎందుకు వస్తున్నావో కనిపెట్టేసాను'' అంది రాజేశ్వరి కూతురి ప్రవర్తన తనకంతా తెలుసునన్నట్లుగా.

''సరే మమ్మీ నీకంతా తెలిసిపోయింది కదా! నేను కిరణ్‌ని ప్రేమిస్తున్నాను. అతనినే పెళ్లి చేసుకుంటాను'' అంది దృఢమైన మనసుతో.

''అందుకు మేము అంగీకరించకపోతే?'' అంది రాజేశ్వరి.

''మీరు అంగీకరించకపోయినా నేను అతనినే చేసుకుంటాను. అవసరమైతే ఇంట్లోంచి పారిపోయి అయినా సరే'' అంది స్వప్న తన దృఢనిర్ణయాన్ని తెలియజేస్తూ.

స్వప్న నిర్ణయం విని రాజేశ్వరి ఒక్కసారిగా షాక్ తిన్నది.

'తన కూతురు కూడా ఈ కాలం ఆడపిల్లలానే ఆలోచిస్తోంది. కేవలం తాత్కాలిక ఆకర్షణకులోనై లోతుగా ఆలోచించకుండా కిరణ్ గురించి వివరాలు సేకరించకుండానే వేగిరపాటు నిర్ణయం తీసుకుంది. ఆమె నిర్ణయాన్ని మార్చుకొనేలా చేయాల్సిన బాధ్యత తల్లిగా తనపై ఉన్నది' అనుకుంది రాజేశ్వరి శాంతంగా.

''స్వప్నా! అయితే ఒక పని చెయ్యి'' అంది రాజేశ్వరి శాంతంగా.

''ఏమిటి చెప్పు మమ్మీ'' అంది స్వప్న తల్లి చెప్పబోయే పని ఏమిటోనని ఆలోచిస్తూ.

''నువ్వు ఇప్పుడే వెళ్లి ఆ కిరణ్‌ని మనింటికి తీసుకురా! అన్ని విషయాలూ మాట్లాడదాము'' అంది రాజేశ్వరి.

''ఇప్పుడు కుదరదు మమ్మీ! కిరణ్ ఊరు వెళ్లాడు. వారం రోజుల వరకూ రాడు. వారం తర్వాత అతను వచ్చిన తర్వాత తీసుకువస్తాను'' అంది స్వప్న.

''నెలరోజులుగా నీ ప్రత్యేక ప్రవర్తనకు కారణం నేను కనిపెట్టి అదే విషయాన్ని మీ డాడీ ముందుంచాను. స్వప్నా! తండ్రిగా ఆయన కర్తవ్యం ఆయన నిర్వర్తించారు. ఆయన బాధ్యతను ఆయన చేపట్టి విషయమంతా మూడురోజులలో తెలుసుకోగలిగారు'' అంది రాజేశ్వరి.

ఇంతలో ఆఫీసు నుండి స్వప్న తండ్రి విశ్వనాథ్ వచ్చాడు.

''ఏమిటి మమ్మీ డాడీ తెలుసుకున్న విషయమేమిటీ?'' అంది స్వప్న.

''నువ్వు కిరణ్‌ని రోజూ పార్కులో కలుసుకుంటున్న విషయం మీ డాడీకి చెప్పగానే మీ డాడీ ఆ కిరణ్‌ను గురించి ఎంక్వయిరీ చేసారు. అతను ఎప్పుడూ బార్‌ల చుట్టూ తిరుగుతూ పూర్తిగా తాగుడుకు బానిస అయినట్లు, కేవలం డబ్బుకు ప్రాధాన్య మిస్తూ పెద్దకట్నం ఇచ్చే అమ్మాయితో వివాహానికి ఒప్పుకున్నట్లు తేలింది. మరో రెండు రోజులలో అతని పెళ్లి జరగబోతున్నట్లు తెలిసింది. మీ డాడీ నాకు ఈ విషయమంతా సేకరించి చెప్పారు'' అంది రాజేశ్వరి.

స్వప్న నమ్మలేనట్లుగా తండ్రి వైపు చూసింది.

విశ్వనాథ్ తన జేబులోని వెడ్డింగ్ కార్డ్ తీసి స్వప్న చేతికిచ్చాడు. స్వప్న ఆశ్చర్యంగా దానిని అందుకుంది.

''స్వప్నా ఆ వెడ్డింగ్ కార్డ్ కిరణ్‌ది. అతను పచ్చి మోసగాడు. ఎల్లుండి అతని పెళ్లి. కష్టపడి వెడ్డింగ్ కార్డ్ కూడా సేకరించగలిగాను'' అన్నాడు విశ్వనాథ్.

విశ్వనాథ్ మాటలకు స్వప్న కళ్లు చెమర్చాయి.

''మమ్మీ! మీరు నాకు జన్మ నివ్వడమే కాకుండా జీవితం నరకంలో పడకుండా కాపాడారు. లేకుంటే ఆ కిరణ్ పెళ్లి చేసుకొని వారంరోజుల తర్వాత నా దగ్గరకు వచ్చి నన్ను కూడా మోసం చేసేవాడు. ఆ ప్రమాదం నుండి నన్ను తప్పించారు. మీరు నేటి తల్లిదండ్రులు.''

**-జి.మేరీ కృపాబాయి**(మచిలీపట్నం)

# పోస్ట్‌మాన్ రామయ్య

**ఆ గ్రామానికి పోస్ట్‌మాన్ రామయ్య. అతనిని పోస్ట్‌మాన్ అని అనేకంటే గ్రామ శ్రేయోభిలాషి, గ్రామ బంధువు లేదా గ్రామ అతిథి అంటే అతనికి తగినట్లుగా వుంటుంది. అతనంటే గ్రామంలోని పిల్లలకు, పెద్దలకు, యువతీ యువకులకు అందరికీ ఇష్టమే. దీనికి కారణం అతని ముఖంలో చెరగని చిరునవ్వు, ఓర్పు, శాంతం కనపడేవి. చదువు రాని వాళ్లకి వాళ్ల కోరిక మేరకు వాళ్లకి వచ్చిన ఉత్తరాలు చదివి వినిపించేవాడు. వాళ్లు కోరినట్లు ఉత్తరాలు రాసిపెట్టేవాడు. టెలిగ్రాములు వచ్చిన వాళ్లకి ఇంగ్లీషు తెలియకపోతే వాళ్లకి వాటి అర్థాన్ని తెలుగులోకి తర్జుమా చేసి చెప్పేవాడు. వీటన్నింటిని మించి గ్రామంలో ఎవరైనా తమ స్వంత సమస్యలకి పరిష్కారాన్ని చూపమని అడిగితే, అతను దానికి పరిష్కారం తగినట్లుగా చూపేవాడు.**

రామయ్య బ్రాంచి ఆఫీసునుంచి పదిమైళ్లు సైకిలు తొక్కి తపాలా సంచితో ఆ గ్రామం చేరుకునేవాడు. ముందుగా ఆ గ్రామ మునసబు శేషయ్య ఇంటికి వెళ్లి అక్కడ చల్లని మజ్జిగ తాగేవాడు. కొంచెం సేపు శేషయ్యతో గ్రామంలో విశేషాలను గురించి మాట్లాడుతూ విశ్రాంతి తీసుకుని సైకిలు తొక్కిన అలసటను వదల్చుకుని, మిగిలిన ఇళ్లలో ఉత్తరాలు వగైరా ఇవ్వడానికి బయలుదేరేవాడు.



ఏదైనా పండుగ వచ్చిందంటే రామయ్యకు ఆరోజున పిండివంటలతో భోజనం శేషయ్య ఇంట్లోనే ఏర్పాటయ్యేది. శేషయ్య, రామయ్యలో ఒక ఆప్త మిత్రుడిని చూసుకునేవాడు.

శేషయ్యకు ఒక్కగానొక్క కూతురు. కొడుకులు లేరు. పెళ్లీడుకు వచ్చిన ఆమెకు ఒక మంచి పట్నం సంబంధం కుదిరింది. పెళ్లికి ముహూర్తం పెట్టారు. పెళ్లి శుభలేఖ అందరితో పాటుగా రామయ్య కూడా అందుకున్నాడు. పెళ్లి యధావిధిగా జరిగింది. పెళ్లి సందడి అంతా ముగిసిన వారం రోజుల తరువాత రామయ్య ఒక టెలిగ్రాంను శేషయ్య కందించాడు. అసలా టెలిగ్రాం పెళ్లి రోజున ముహూర్తానికి ముందుగా అందవల్సింది. కానీ రామయ్య ఆ టెలిగ్రాంను శేషయ్యకు అప్పుడే ఇవ్వలేదు. శేషయ్యకు దగ్గర బంధువు ఒకాయన చనిపోయాడని ఆ టెలిగ్రాంలో వుంది. ఆ చెడు వార్త శేషయ్యకు తన కూతురు పెళ్లి ముహూర్తానికి ముందుగానే తెలిస్తే పెళ్లి ఆగిపోతుందని, పెద్ద ఖర్చుతో చేసిన ఏర్పాట్లన్నీ దండగ అవుతాయని, అందరూ బాధపడతారని ఆలోచించి రామయ్య ఆ టెలిగ్రాం వారం రోజులు ఆలస్యంగా శేషయ్యకిచ్చాడు. శేషయ్య తన దగ్గర బంధువు మరణానికి బాధపడినప్పటికీ, తన కూతురు పెళ్లి ఏ ఆటంకం లేకుండా జరగటానికి సహాయపడిన రామయ్యను మనసారా అభినందించాడు.. తనకు టెలిగ్రాంను ఆలస్యంగా ఇచ్చినందుకు శేషయ్య పోస్టు అధికారులకు రామయ్యపైన ఫిర్యాదు చెయ్యని కారణంగా కర్తవ్య నిర్వహణలో రామయ్య చేసిన తప్పు బయట పడలేదు.

**-కూచిభట్ల శ్రీనివాసశాస్త్రి**
(హైదరాబాద్)